సాక్షి
మంచిర్యాల
గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



ఆకతాయిలకే ఆటవిడుపు

ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్‌లు ఆకతాయిలకు ఆటవిడుపుగా మారాయి. చాలాచోట్ల కనీస మరమ్మతులకు నోచుకోక వృథాగా దర్శనమిస్తున్నాయి. 9లో▸

ఎన్డీఆర్‌ఎఫ్ పర్యటన

కోటపల్లి: మండలంలోని అర్జునగుట్ట, లక్ష్మీపూర్, బోరంపల్లి, ఎర్రాయిపేట గ్రామాలను ఎన్డీఆర్‌ఎఫ్ బుధవారం సందర్శించింది. నదీ తీర ప్రాంతాలను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో నీటమునిగిన పంటలు, భూముల వివరాలను గ్రామస్తుల నుంచి సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఆర్‌ఎఫ్ అధికారి సురేశ్, ఆర్‌ఐ రాజలింగు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
32.0 /20.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. దక్షిణం దిశగా ఈదురు గాలులు బలంగా వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు మధ్యాహ్నం స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బి.రాహుల్

మంచిర్యాలఅగ్రికల్చర్: రోడ్డు ప్రమాదాల నివారణలో భద్రత నిబంధనలు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో రోడ్లు–భవనాల శాఖ, అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణలో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించడం ద్వారా సురక్షితమైన ప్రయాణం చేయవచ్చని, ప్రమాదాలకు గురయ్యే అవకాశం తక్కువగా ఉంటుందని అన్నారు. మొబైల్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడుపరాదని తెలిపారు. ఆటోలు, జీపులు ఇతర ప్రైవేట్ రవాణా వాహనాలు పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయొద్దని అన్నారు. రోడ్డు ప్రమాదాలతో అనేక కుటుంబాలు రోడ్డున పడి ఆర్థికంగా చితికిపోతున్నాయని తెలిపారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా అల్లం రవి ఎన్నిక



బాధ్యతలు స్వీకరిస్తున్న అల్లం రవి, డైరెక్టర్లు

జన్నారం: మండలంలోని పొనకల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) నూతన చైర్మన్‌గా రేండ్లగూడకు చెందిన అల్లం రవిని డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గడంతో ఇంచార్జి డీసీవో నర్సయ్య ఆధ్వర్యంలో బుధవారం డైరెక్టర్ల సమావేశం ఏర్పాటు చేశారు. 13మంది డైరెక్టర్లు హాజరై చేతులెత్తే పద్ధతిన రవిని ఎన్నుకున్నారు. దీంతో డీసీవో అధికారికంగా ప్రకటించగా రవి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్మన్ అల్లం రవి, వైస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లను సొసైటీ తరఫున సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, మాజీ ఎంపీపీ మచ్చ శంకరయ్య, సీనియర్ నాయకులు రాజశేఖర్, శుభాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కరుణాకర్, ఫసీఉల్లా తదితరులు రవిని అభినందించారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: ఇంటర్మీడియెట్ ప్రయోగ (ప్రాక్టికల్) పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 36 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 10 ప్రభుత్వ, 10 ప్రైవేటు, 16 సెక్టార్ కళాశాలలు ఉన్నాయి. జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 7,106 మంది, ద్వితీయ సంవత్సరం 7031 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ పాఠ్యాంశాలతోపాటు ఒకేషనల్ విభాగం విద్యార్థులు హాజరవుతారు. ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. మొదటి విడత పరీక్షలు ఈ నెల 1నుంచి 5వరకు, రెండో విడత 6నుంచి 10వరకు, మూడో విడత 11నుంచి 15 వరకు ఉంటాయి. మొదటి సంవత్సరం విద్యార్థులకు 16న ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షలుంటాయి. నైతిక మానవీయ విలువల పరీక్ష ఇదివరకు పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ఈ నెల 17న, పర్యావరణ విద్యపై మొదటి సంవత్సరం విద్యార్థులందరికీ ఈ నెల 19న పరీక్ష నిర్వహిస్తామని, సంబంధిత కళాశాలల్లోనే హాల్‌టికెట్లు పొందాలని డీఈఐఈవో శైలజ తెలిపారు.

పోషకాహారం సక్రమంగా అందించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రతినిధి శివాల్కర్‌రెడ్డి

మంచిర్యాలటౌన్: జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, ఐదేళ్లలోపు పిల్లలకు సకాలంలో పోషకాహారం, అనుబంధ ఆహారం సక్రమంగా అందించేలా చూడాలని యునిసెఫ్ రాష్ట్ర ప్రతినిధి శివాల్కర్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని చెన్నూరు, లక్సెట్టిపేట ప్రాజెక్టుల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను రాష్ట్ర ఐటీ కమిటీ ప్రతినిధి హరిణి సీలేష్‌లతో కలిసి సందర్శించిన అనంతరం జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్యతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, లక్సెట్టిపేట సీడీపీవోలు ఏ.విజయలక్ష్మి, ఎం.రేష్మ, పోషణ్ అభియాన్ డీసీ రజిత, సమన్వయకర్తలు సతీశ్, లక్ష్మి పాల్గొన్నారు.

సీఎం సారూ.. సమస్యలివీ!



తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహితనదిపై ప్రాజెక్టు నిర్మించాల్సిన ప్రాంతం (ఫైల్)

- పలు పెండింగ్ పనులపై ప్రజల వినతి
- ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై స్థానికుల ఆశలు
- రేపు ఇంద్రవెల్లికి సీఎం రేవంత్‌రెడ్డి రాక

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు వస్తున్న ఎనుముల రేవంత్‌రెడ్డిపై ఇక్కడి ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించి బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ సభకు సంబంధించి అధికారులు, అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో సీఎం పర్యటన సందర్భంగా ఇక్కడి అభివృద్ధి కోసం నిధుల ప్రకటన, కొత్త పనుల కోసం హామీలు ఇవ్వాలని కోరుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో అనేక సమస్యలు ఉన్నాయి.

గిరిజనుల గోస

ఉమ్మడి జిల్లా ఏజెన్సీ పరిధిలో గిరిజనులకు ఇప్పటికీ అటవీ సమీప గ్రామాలకు సౌకర్యాల్లేవు. చాలాచోట్ల విద్య, వైద్యం, తాగునీరు, అన్ని



మంచిర్యాలలో ఇళ్లలోకి గోదావరి వరద నీరు(ఫైల్)

కాలాల్లో రవాణాకు రోడ్లు అందుబాటులోకి తేవాల్సి ఉంది. ఇంద్రవెల్లి, నార్నూర్, జైపూర్, లింగాపూర్ మండలాల్లో వానాకాలాల్లో ఇప్పటికీ మట్టి రోడ్లే దిక్కవుతున్నాయి. పక్కా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. అటవీ అనుమతులు రాక పనులు ముందుకు సాగడం లేదు. ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక కేంద్రాలు, సామాజిక ఆస్పత్రుల్లో సరిపడా వైద్య సిబ్బంది లేక అరకొర వైద్యం అందుతోంది. ఏజెన్సీలో సౌకర్యాలు మెరుగుపర్చాల్సి ఉంది. జిల్లా కేంద్రాల్లో ప్రధాన ఆస్పత్రులతోపాటు ఆదిలాబాద్ రిమ్స్‌లోనూ సిబ్బంది ఖాళీలతో వైద్యంపై ప్రభావం పడుతోంది. ఉట్నూరు ఐటీడీఏను సమగ్రంగా ప్రక్షాళన చేయాల్సి ఉంది. నాలుగు జిల్లాల విస్తరణతో పరిపాలనలో సమస్యలు వస్తున్నాయి. ఆసిఫాబాద్‌లో మినీ ఐటీడీఏ ఏర్పాటు కార్యాచరణ దాల్చలేదు.

గిరిజనేతరులకు..

ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులకు ఉద్యోగ, ఉపాధి, విద్యాసంస్థల్లో అవకాశాలు తక్కువగా ఉన్నాయి. అటవీ హక్కుల చట్టం కింద గిరిజనులకు మాత్రమే పోడు పత్రాలు ఇవ్వడంతో గిరిజనేతరులకు సైతం ఇవ్వాలని డిమాండ్లు చేస్తున్నారు. పోడు హక్కు పత్రాలు తమకు కూడా ఇవ్వాలని వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు.

సింగరేణి ప్రాంతంలో కార్మికులకు..

సింగరేణి ప్రాంతంలో కొత్త గనుల ప్రారంభం, ఓపెన్ కాస్టుల స్థానంలో భూగర్భ గనులు ప్రారంభించాలనే ప్రతిపాదనలు అటకెక్కాయి. దీంతో ఉపాధి అవకాశాలు తగ్గి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెరుగుతున్నారు.

మున్సిపాలిటీల్లో..

ఉమ్మడి జిల్లాలో నిర్మల్, భైంసా, ఖానాపూర్, ఆదిలాబాద్, కాగజ్‌నగర్, మంచిర్యాల, లక్సెట్టిపేట, నస్పూర్, చెన్నూరు, క్యాతనపల్లి, మందమర్రి, బెల్లంపల్లి పట్టణాలు ఉన్నాయి. వీటి పరిధిలో అనేక సమస్యలు ఉన్నాయి. పట్టణ వాసులకు తాగునీరు, రోడ్లు, మౌలిక వసతులు అరకొరగా అందుతున్నాయి. ఇక ఉట్నూరు, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ ఇంకా గ్రామ పంచాయతీలుగానే కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంగా ఉన్న ఆసిఫాబాద్‌కు మున్సిపాలిటీ హోదా దక్కలేదు. ఇక మందమర్రి పట్టణంలో ఏజెన్సీ వివాదంతో ఎన్నికలు జరగడం లేదు. ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు. ఇక గ్రామ పంచాయతీలకు నిధులు, సర్పంచ్‌లకు పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపులు పూర్తి చేయాల్సి ఉంది.

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు

ఉమ్మడి జిల్లాలో సరైన సాగునీటి ప్రాజెక్టులు లేక ఇంకా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నీటి వనరులున్నా సమర్థవంతంగా ఉపయోగించుకోలేని పరిస్థితి నెలకొంది. ప్రధాన ప్రాజెక్టులైన కడెం, సరస్వతి కాలువ (ఎస్సారెస్పీ) ఆధునీకరించాల్సి ఉంది. మధ్యతరహా ప్రాజెక్టుల్లో స్వర్ణ, వట్టివాగు, సాత్నాల, ఎన్టీఆర్, పీపీ రావు ప్రాజెక్టు, గడ్డెన్నవాగు, సదర్మాట్ ఉన్నాయి. కుమురంభీం జిల్లా పరిధిలో కుమురంభీం ప్రాజెక్టు కాలువలు పూర్తి చేయాల్సి ఉంది. తాంసిలో మత్తడివాగు, పెన్‌గంగా ప్రాజెక్టు, హాజీపూర్ మండలం ముల్కల్లలోని ర్యాలీవాగు, వేమనపల్లి మండలం నీల్వాయి, భీమారంలో గొల్లవాగు ప్రాజెక్టులు ఉన్నాయి. గత కాంగ్రెస్ హయాంలో చేపట్టిన కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై ఉన్న డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ప్రాణహిత–చేవేళ్ల ప్రాజెక్టును బీఆర్‌ఎస్ ప్రభుత్వం పక్కన పెట్టింది. తాజా గా కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో ఈ ప్రాజెక్టుపై మళ్లీ ఆశలు పెరిగాయి. ఇక కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల పరిధి లో ప్రాణహిత, గోదావరి తీర ప్రాంత రైతుల పంటలు ఏటా నీట మునుగుతున్నాయి. వీటి కోసం శాశ్వత పరిష్కారం చూపాల్సి ఉంది. మంచిర్యాల, నస్పూర్ పట్టణాల్లో లోతట్టు ప్రాంతాలు వరదలు వచ్చి ముంపునకు గురవుతున్నాయి.

స్పష్టమైన ఓటరు జాబితాకు చర్యలు

- జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం–2024లో భాగంగా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో కొనసాగుతున్న ఫారం 6, 7, 8 దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ఆర్డీవో, మంచిర్యాల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.రాములుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ నూతన ఓటరు నమోదుకు 1 జనవరి 2024ను ప్రామాణికంగా తీసుకుంటున్నట్లు తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాపై ఫిబ్రవరి 2న అభ్యంతరాలు, ఫిర్యాదులను పరిష్కరించి, 6న పారామీటర్లు పరిశీలించి తుది జాబితా 8న ప్రచురిస్తామని పేర్కొన్నారు. ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితాకు చర్యలు తీసుకోవాలని, ఫొటో సిమిలారిటీ, రెండు చోట్ల ఓటరు కార్డు కలిగి ఉండడం, మృతుల వివరాలు తొలగించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన, ఆన్‌లైన్‌లో నమోదుపై అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పంటల పరిశీలన

కాసిపేట: మండలంలోని సోనాపూర్ శివారులో వ్యవసాయశాఖ ఎంపిక చేసిన సర్వేనంబర్లలో రైతులు వేసిన పంటలను జిల్లా వ్యవసాయాధికారి కల్పన బుధవారం పరిశీలించారు. శనగ, జొన్న, మిరప పంటలను పరిశీలించి సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు వివరించారు. సాగులో ఎటువంటి అనుమానాలు, సమస్యలు తలెత్తినా వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి సలహాలు, సూచనలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి అంజలి, రైతులు పాల్గొన్నారు.

నజరానా ఇస్తేనే ట్రాఫిక్ డ్యూటీ..!

- హోంగార్డుల జీవితం దుర్భరం
- అదనపు అలవెన్స్ కోసం పాట్లు
- చాలీచాలని జీతాలతో ఇబ్బందులు



మంచిర్యాల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్

మంచిర్యాలక్రైం: ప్రజల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖలో ట్రాఫిక్ పోలీసు విభాగం సేవలు అత్యంత ప్రాధాన్యమైనవి. ట్రాఫిక్ విభాగంలో పని చేయడం కత్తిమీద సాములాంటిదే. విధుల్లో ఉన్నంతసేపు నిలబడే ఉండాలి. ఎండ, వాన, దుమ్ము, ధూళి తట్టుకుని విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అయినా ట్రాఫిక్ విభాగంలో విధులకు హోంగార్డు మొదలుకుని కానిస్టేబుల్ వరకు 50శాతం ఉద్యోగులు ఆసక్తి చూపిస్తుంటారు. చాలీచాలనీ జీతాలతో దుర్భరమైన జీవితాలను వెళ్లదీస్తున్న వారికి వేతనంతోపాటు అదనంగా 30శాతం అలవెన్స్ ఇవ్వడమే అందుకు కారణం. ఇదే అదునుగా భావించి కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న హోంగార్డు విభాగానికి చెందిన ఓ ఉన్నతాధికారి ముడుపులు ముట్టజెప్పితేనే విధులు కేటాయిస్తున్నారని కొందరు హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేశారు.

నెలకు రూ.10వేలపైనే..

ట్రాఫిక్ విధులు నిర్వర్తించే ఉద్యోగులకు ప్రభుత్వం అదనంగా 30శాతం అలవెన్స్ ఇస్తోంది. ఇందుకోసం హోంగార్డులు ట్రాఫిక్ విభాగంలో పని చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. హోంగార్డులకు ప్రభుత్వం దినసరి కూలి కిందనే లెక్కగట్టి రోజుకు రూ.920 చెల్లిస్తోంది. సెలవులు ఉండవు. ఏదైనా అత్యవసర పనిపై వెళ్తే ఆ రోజు వేతనం కోత విధిస్తారు. డ్యూటీలు చేసిన మస్టర్ల ఆధారంగానే వేతనం చెల్లిస్తారు. దీంతో ట్రాఫిక్ విభాగంలో చేస్తే అలవెన్స్ కలిసి వస్తుందని ఉత్సాహం చూపిస్తారు. వీరిని ముడుపుల శాపం పీడిస్తోంది. అవకాశం కోసం ముందుగా రూ.10వేలు నజరానా ముట్టజెప్పాలి. ఆ తర్వాత నెలకు రూ.వెయ్యి చొప్పున చెల్లించాల్సిందే. హోంగార్డు ట్రాఫిక్ విభాగంలో పని చేయడానికి ఆరు నెలలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఆ తర్వాత మరొకరిని నియమిస్తారు. ఎవరికి విధులు కేటాయించాలన్నా.. ఎవరిని తప్పించాలన్నా అంతా ఆయన చేతుల్లోనే ఉంటుంది. ఒకసారి ట్రాఫిక్ విధుల్లోకి తీసుకుంటే ఆరు నెలలు చేయాలి. మళ్లీ కొనసాగాలనుకుంటే మరో రూ.10వేలు చెల్లించాల్సిందే. లేదంటే మరొకరిని తీసుకుంటారు.

సాధారణ పోలీసులతో సమానంగా విధులు

సాధారణ పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డులకు వేతనాల విషయంలో చాలా వ్యత్యాసం ఉంది. హోంగార్డులు మృతిచెందితే వారి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రత్యేక నిధి ఏమీ లేదు. గతంలో హోంగార్డు సంక్షేమ కార్యక్రమాల కోసం ప్రతీ హోంగార్డు వేతనం నుంచి నెలకు రూ.20 వసూలు చేసి అందులో నుంచి రూ.10 కేంద్రనిధికి, మిగతా రూ.10 హోంగార్డుల సంక్షేమ నిధికి జమ చేసేవారు. సహజ మరణానికి రూ.15వేలు, ప్రమాదవశాత్తు మృతికి రూ.20వేలు సంక్షేమ నిధి నుంచి ఇచ్చేవారు. ప్రస్తుతం దీన్ని తొలగించినట్లు సమాచారం.

హోంగార్డుల జీవితాలు దుర్భరం

విధి నిర్వహణలో చాలామంది హోంగార్డులు అనారోగ్యం బారిన పడుతున్నారు. దుమ్ము, ధూళిలో పని చేస్తూ శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. ప్రత్యేకంగా హెల్త్‌కార్డులేమీ లేకపోవడంతో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారు. ఏళ్ల తరబడిగా విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డులకు ఆరోగ్య భద్రత లేకుండా పోయింది. ఇతర జిల్లాలకు బందోబస్తులకు వెళ్తే టీఏ, డీఏ, ఇతర అలవెన్స్ ఇవ్వడం లేదు. ఏడాదికి నాలుగు జతల దుస్తులు ఇవ్వాల్సి ఉండగా అవీ అందడం లేదు.

చర్యలు తీసుకుంటాం...

ట్రాఫిక్ విభాగంలో పని చేసేందుకు హోంగార్డుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. ఇలాంటి ఘటనలపై విచారించి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్

'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో

మంచిర్యాలటౌన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డీఈవో ఎస్.యాదయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం హాజీపూర్, భీమారం, నస్పూర్, చెన్నూరు, దండేపల్లి, మందమర్రి, జైపూర్, లక్సెట్టిపేట, మంచిర్యాల మండలాల ప్రభుత్వ, కేజీబీవీ, టీఎస్‌ఎంఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు ఎలా సంసిద్ధులను చేయాలనే అంశంపై వివరించారు. పదో తరగతి సిలబస్‌ను పూర్తి చేయడంతోపాటు ప్రతీ పాఠశాల హెచ్‌ఎం సమీక్షిస్తూ వందశాతం ఫలితాల సాధనకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించారో అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరిలో నిర్వహించే గ్రాండ్ టెస్టు, ప్రిఫైనల్ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీజీఈ దామోదర్‌రావు, డీసీఈబీ సెక్రెటరీ కొండు భీమ్‌రావు, సెక్టోరియల్ అధికారులు సత్యనారాయణమూర్తి, యశోధర, ఎంఈఓలు జే.పోచయ్య, కే.రాధాకృష్ణమూర్తి, డీసీఈబీ సహాయక కార్యదర్శి డి.కుమారస్వామి పాల్గొన్నారు.

హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించడంపై అవగాహన



హెల్మెట్ ధరించిన వారికి అధికారుల అభినందనలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ చైతన్యం కావాలంటూ జిల్లా రవాణా శాఖ అధికారి(డీటీఓ) ఎల్.కిష్టయ్య వాహదారులకు అవగాహన కల్పించారు. బుధవారం హాజీపూర్ మండలం వేంపల్లి జాతీయ రహదారిపై హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించిన వాహనచోదకులను అభినందించారు. రాష్ట్ర, జాతీయ రహదారులపై నిత్యం భారీ, ఇతర వాహనాలతోపాటు ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, నిబంధనలు సక్రమంగా పాటించకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. క్షతగాత్రులు, మృతుల కారణంగా బాధిత కుటుంబాలు మానసిక క్షోభను అనుభవిస్తూ మరికొన్ని కుటుంబాలు రోడ్డున పడుతున్న సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్, కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహన డ్రైవర్లు, యజమానులు సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ రాహుల్‌కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాలివాహన పవర్‌ప్లాంట్ కార్మికుల నిరాహార దీక్ష



నిరాహార దీక్ష చేస్తున్న శాలివాహన పవర్‌ప్లాంట్ కార్మికులు

పాతమంచిర్యాల: బకాయిలు, కంపెనీ మూత బెన్‌ఫిట్‌లు చెల్లించాలని శాలివాహన పవర్‌ప్లాంటు కార్మికులు బుధవారం ప్లాంటు గేటు ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ప్లాంటు కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్, భారతీయ మజ్దూర్ సంఘ్ సింగరేణి కోల్‌మైన్స్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య మాట్లాడుతూ పవర్‌ప్లాంటు మూసి వేసి 14నెలలు గడుస్తున్నా కార్మికులకు వేతనాలు, బెన్‌ఫిట్‌లు యాజమాన్యం చెల్లించకపోవడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్లాంటు ఎండీ ముల్కా కొమురయ్య మొండిగా వ్యవహరిస్తున్నారని, కార్మిక చట్టాల ప్రకారం బెన్‌ఫిట్లు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే బకాయిలు చెల్లించని పక్షంలో హైదరాబాద్‌లోని ప్లాంట్ మేనేజింగ్ డైరెక్టర్ మల్కా కొమురయ్య ఇంటి ఎదుట కార్మికుల కుటుంబసభ్యులతో నిరసన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎంఎల్ జిల్లా కార్యదర్శి మాతూరి రాజుయాదవ్, పవర్‌ప్లాంట్ కార్మిక సంఘం కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఆనందరావు,ఎడ్ల శ్రీనివాస్,శెట్టి శ్రీనివాస్ కార్మికులు ఆసరి రాజయ్య,ఎస్. తిరుపతి, బుచ్చయ్య, ఈసారపు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో నామినేటెడ్ పోస్టుల భర్తీ



ఉత్తర్వులు అందిస్తున్న నంద అశోక్

మంచిర్యాలటౌన్: టీఎన్జీవో యూనియన్ మంచిర్యాల యూనిట్ కార్యవర్గంలో ఎనిమిది మందిని నామినేట్ బుధవారం జిల్లా టీఎన్జీవో కోఆర్డినేటర్ నంద అశోక్ ఉత్తర్వులు అందజేశారు. మంగళవారం జరిగిన మంచిర్యాల యూనిట్ నూతన కమిటీ తీర్మానించిన వారిని నామినేటెడ్ పోస్టుల కింద భర్తీ చేసినట్లు వారు తెలిపారు. ఉపాధ్యక్షులుగా ఎస్.శ్రీనివాస్, పి.పద్మ, కే.సతీశ్‌రావు, జాయింట్ సెక్రటరీలుగా డి. విజయ, మజార్, సునితారాణి, సంజీవ్ కుమార్, రాజేందర్, కార్యవర్గ సభ్యులుగా ప్రణయ్‌గౌడ్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, సునిత, ప్రభు, కెజియారాణి, యూసఫ్, రామ్‌కుమార్, తిరుపతి, సతీశ్, వెంకటేశ్, సరిత పాల్గొన్నారు.

కులధ్రువీకరణ పత్రాలు అందజేయాలి



ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న గ్రామస్తులు

వేమనపల్లి: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలు కులధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, కరెంట్ బిల్లులు స్థానిక ట్రాన్స్‌కో సిబ్బందికి అందజేయాలని జిల్లా ట్రాన్స్‌కో ఎస్‌ఈ శేషారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు అందజేసే వంద యూనిట్ల సబ్సిడీ పథకం వర్తించాలంటే కుల ధ్రువీకరణ పత్రం అందజేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 45,267 మంది ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులు ఉన్నారని, ఇందులో ఎస్సీలు 30,023, ఎస్టీలు 10,244 మంది ఉన్నారని తెలిపారు. ఇందులో 17,288 మంది ఇంకా తమ కులధ్రువీకరణ పత్రాలు అందజేయలేదని అన్నారు. ధ్రువీకరణ పత్రం అందజేయని పక్షంలో సబ్సిడీ విద్యుత్ పథకానికి అర్హత కోల్పోతారని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించాలని సూచించారు. నూతన సబ్‌స్టేషన్ పనులను పరిశీలించిన ఆయన యార్డ్ పనులు ప్రారంభించేందుకు 33కేవీ విద్యుత్ లైన్ నిర్మాణంపై సిబ్బందిని వివరాలు అడిగారు. డీఈ ఎంఆర్‌టీ కన్‌స్ట్రక్షన్ పెద్దిరాజు, ఏడీ కన్‌స్ట్రక్షన్ వెంకటేశ్వర్లు, ఏడీ సివిల్ యాదగిరి, ఏఈ దీక్షిత్, ఎల్‌ఐ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

6నుంచి సదరం వైద్య శిబిరాలు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఈ నెల 6 నుంచి సదరం వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి తెలిపారు. దివ్యాంగ ధ్రువీకరణ కోసం మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుని నిర్ణీత సమయంలో శిబిరానికి హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ నెల 2న ఉదయం 10 గంటలకు స్లాట్ ఓపెన్ చేస్తారని తెలిపారు. సర్టిఫికెట్ల కాల పరిమితి ముగిసిన వారు రెన్యూవల్, నూతన సర్టిఫికెట్ పొందడానికి సకాలంలో హాజరు కావాలని తెలిపారు. 6, 9న మూగ, చెవుడు 100 మందికి, 8, 19న శారీరక వికలాంగులు(ఆర్థో) 100 మందికి, 14, 23న కంటిచూపు సమస్యలు ఉన్నవారు(60) మంది, మానసిక వికలాంగులు 100 మందికి, 27, 29 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు.

క్లుప్తంగా

యాదవ జర్నలిస్టులు ఐక్యంగా ఉండాలి

జన్నారం: యాదవ జర్నలిస్టులు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని యాదవ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అడహక్ కమిటీ సభ్యులు దోటి నాగరాజు, శెట్టి హరికృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో ఉమ్మడి జిల్లా యాదవ జర్నలిస్టుల యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల నూతన కమిటీలను నియమించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని అడహక్ కమిటీ సభ్యులు దేవేందర్, రవికాంత్, పరశురాం, రమేశ్, కుమారస్వామి, మల్లేశ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా 'కాంపెల్లి'


సమ్మయ్య

మందమర్రిరూరల్: సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టీయూసీ)క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా కాంపెల్లి సమ్మయ్యను నియమిస్తూ యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ సభ్యులుగా కలవల శ్యామ్, పేరం శ్రీనివాస్, ఎండీ అక్రం, వడ్డెపల్లి దాస్ ఉన్నారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ సింగరేణిలో యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ఇరువురిపై కేసు


గొడవ పడుతున్న దృశ్యం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన గొడవకు సంబంధించిన కేసులో ఆసిఫాబాద్‌కు చెందిన హోంగార్డు, మరొకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 30న పట్టణంలోని హెల్త్‌కేర్ ఆస్పత్రి సమీపంలో చింతపండువాడకు చెందిన అంబులెన్స్ డ్రైవర్ కాటాల కృష్ణస్వామి, దీక్షిత్ గౌడ్‌ల మధ్య గొడవ జరిగింది. బుధవారం మెడిలైఫ్ ఆస్పత్రి సమీపంలో కృష్ణస్వామిపై సందీప్‌గౌడ్, దీక్షిత్ గౌడ్ మరికొందరు కలిసి దాడికి పాల్పడ్డారు. స్థానికులు 100కు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న బ్లూకోడ్ సిబ్బంది ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సందీప్‌గౌడ్, దీక్షిత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత


పట్టుబడిన ట్రాక్టర్‌తో ఆర్‌ఐ విజయలక్ష్మి

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం బుధాకలాన్ గ్రామ శివారులోని చెరువులో నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. బుధవారం మట్టి తరలిస్తున్నారని గ్రామానికి చెందిన పలువురు ఆర్‌ఐ విజయలక్ష్మికి సమాచారం అందించారు. గ్రామానికి చెందిన రమేశ్ ట్రాక్టర్ ద్వారా మట్టి తరలిస్తుండగా ఆర్‌ఐ పట్టుకుని తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సీఎం సభ విజయవంతం చేయాలి

- అధికారంలోకి వచ్చిన తరువాత ఇంద్రవెల్లిలో తొలి పర్యటన
- వెనుకబడిన ఉమ్మడి జిల్లాను అభివృద్ధి చేస్తాం
- అమరుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటాం
- పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క


అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క


నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి


సభ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

ఇంద్రవెల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫిబ్రవరి 2న ఉద్యమాల గడ్డ ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ గౌష్ ఆలాంతో కలిసి కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. నాగోబా దర్బార్ హాల్‌లో సీఎం పర్యటనపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సభ ఏర్పాట్లను పరిశీలించారు. జల్ జంగల్ జమీన్ కోసం పోరాడి అసువులు బాసిన అమరుల జ్ఞాపకార్థంగా కోటి రూపాయలతో నిర్మించే స్మృతివనం శంకుస్థాపన కోసం ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. సీఎం మధ్యాహ్నం 1:30 గంటలకు నాగోబా ఆలయాన్ని దర్శించుకున్న అనంతరం దర్బార్‌హాల్‌లో 400 మంది స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులతో సమావేశం నిర్వహిస్తారని, అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అలాగే అమరవీరుల స్తూపాన్ని సందర్శించి నివాళులర్పిస్తారని వివరించారు. అలాగే సీఎం పర్యటన ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం నుంచి ప్రారంభించనున్నట్లు చెప్పారు. వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై ప్రత్యేక అభిమానం ఉందని, అన్ని విధాలుగా జిల్లాను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. అభివృద్ధికి ముందడుగు ఇక్కడి నుంచే బాటలు పడుతాయన్నారు. రేవంత్ రెడ్డి మొదటి సభ, భట్టి విక్రమార్క పాదయాత్ర ఈ జిల్లా నుంచే ప్రారంభించారని వివరించారు. అందుకే అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి సభ ఇంద్రవెల్లిలోనే నిర్వహించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ కట్టిన కడెం ప్రాజెక్టును పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని, ఇష్టానుసారంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ ప్రొఫెసర్ కోదండరాంను వాడుకున్నారని, ఉద్యమకారులకు గుర్తింపు లేకుండా కుట్రలు చేశారన్నారు. బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ కాదని, కల్వకుంట్ల కుటుంబ పార్టీ అని ఆరోపించారు. కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, డీఆర్‌డీవో పీడీ కిషన్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఉట్నూర్ ఆర్‌డీవో జివకర్‌రెడ్డి, డీఎల్పీవో భిక్షపతిగౌడ్, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, సర్పంచ్ మెస్రం రేణుక నాగ్‌నాథ్, మెస్రం వంశం ఉద్యోగస్తులు మనోహర్, శేఖర్‌బాబు, సోనేరావ్, తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లను అధిగమించాలి


మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, రవాణాలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించాలని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి అన్నారు. బుధవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మల్టీ డిపార్టుమెంటల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని డిపార్టుమెంట్లు సంస్థ అభివృద్ధి కోసం కలిసి పని చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించినప్పుడే సంస్థ అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. డిపార్టుమెంట్ల వారీగా దీని కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం రఘుకుమార్, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏజీఎం మురళీధర్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, డీవీ రావు, ఏజెంట్లు ఏవీరెడ్డి, గోపాల్ సింగ్, ఏరియా వైద్యాధికారి రమేశ్‌బాబు, క్వాలిటీ ఇన్‌చార్జి వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి పెరుగుదలకు సహకరించాలి


వివరాలు వెల్లడిస్తున్న జీఎం మనోహర్

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియాలో బొగ్గు ఉత్పత్తి పెరుగుదలకు ఉద్యోగులు సహకరించాలని ఏరియా జీఎం మనోహర్ అన్నారు. బుధవారం జీఎం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో గత నెల బొగ్గు ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. ఏరియాలో 95 శాతం బొగ్గు ఉత్పత్తి జరిగిందని కేకే–5 గనిలో 103 శాతం, కాసిపేట గనిలో 32, కాసిపేట–2 గనిలో 32, శాంతిఖని గనిలో 18, ఆర్కే ఓసీలో 147, కేకే ఓసీలో 90 శాతం బొగ్గు ఉత్పత్తి జరిగిందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా రెండు నెలలు మాత్రమే ఉందని ఉద్యోగులు రక్షణ సూత్రాలు పాటిస్తూ ఉత్పత్తి లక్ష్యసాధనకు తోడ్పడాలని సూచించారు. ఈ నెల 5 నుంచి 11 వరకు ఏరియాలోని అన్ని గనులు, డిపార్టుమెంట్లపై సంస్థ సీఎండీ బలరాంనాయక్ ఆదేశానుసారం మల్టీ డిపార్టుమెంటల్ సమావేశాలు నిర్వహించి సంస్థ స్థితిగతులను ఉద్యోగులకు వివరించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏజీఎం (ఈఅండ్ఎం) నాగరాజ్, డీవైజీఎం వీఎస్‌ఆర్కే ప్రసాద్, డీజీఎం(సివిల్) శ్రీనివాసులు, ఐఈడీ రాజన్న, డీవైపీఎం మైత్రేయ బంధు, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

'దేశ భవిష్యత్ నిర్మాతలు విద్యార్థులే'


మాట్లాడుతున్న కోఆర్డినేటర్ నారాయణ

మంచిర్యాలఅర్బన్: దేశ భవిష్యత్ నిర్మాతలు విద్యార్థులేనని కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఈసం నారాయణ అన్నారు. బుధవారం మంచిర్యాల పట్టణంలోని వివేక వర్ధిని డిగ్రీ, పీజీ కళాశాలలో ఆదిలాబాద్, నిర్మల్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల ప్రోగ్రాం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సామాజిక చైతన్యానికి, సంఘ సేవలో విద్యార్థి దశ నుంచే భాగస్వాములు కావాలన్నారు. తోటి వారికి సహాయపడేలా కేంద్ర ప్రభుత్వం 1969లో జాతీయ సేవా పథకాన్ని ప్రారంభించిందన్నారు. విద్యార్థులు తమ కళాశాల పరిధిలోని గ్రామాలను దత్తత తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించేలా చొరవచూపాలన్నారు. పారిశుద్ధ్యం, సంపూర్ణ అక్షరాస్యత, వయోజన విద్య, అంటువ్యాధులు, మూఢనమ్మకాలు, జనాభా నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా కన్వీనర్ డా.చంద్రమోహన్ గౌడ్, ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్ తిరుపతి, నిర్మల్ జిల్లా కన్వీనర్ మురళి, ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సమయం సద్వినియోగం చేసుకుంటేనే పురోగతి


మాట్లాడుతున్న జీఎం రవిప్రసాద్

రెబ్బెన(ఆసిఫాబాద్): గనులు, డిపార్టుమెంట్లలో సమయం వృథాను అరికట్టగలిగితే ఆర్థిక స్థితిగతులు మరింత మెరుగుపడుతాయని బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ అన్నారు. బుధవారం గోలేటి లోని జీఎం కార్యాలయం, ఖైరిగూడ ఓసీపీలో మల్టీ డిపార్టుమెంటల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తింపు సంఘం నాయకులు, ఉత్తమ ఉద్యోగులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, ఉద్యోగులు, యంత్రాల పనితీరు గణాంకాలను వివరించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ కార్యక్రమం ద్వారా గనులు, విభాగాల పనితీరును వివరిస్తూనే ఉద్యోగుల అభిప్రాయాలు సైతం తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ఎస్వోటూ జీఎం నరేందర్, ఏజీఎం తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏరియాలో 96 శాతం బొగ్గు ఉత్పత్తి

గత జనవరిలో బెల్లంపల్లి ఏరియా 96 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించినట్లు ఏరియా జీఎం రవిప్రసాద్ తెలిపారు. జనవరిలో ఏరియాకు 4 లక్షల టన్నులు నిర్దేశించగా 3.83 లక్షల టన్నులు సాధించినట్లు తెలిపారు.

తాను చనిపోతూ పలువురికి పునర్జన్మ

- బ్రెయిన్‌డెడ్‌తో ఎలక్ట్రీషియన్ తిరుమలాచారి మృతి
- అవయవాలు దానం చేసిన కుటుంబ సభ్యులు


తిరుమలాచారి(ఫైల్)

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ ముల్కోజు తిరుమలాచారి (43) ఈ నెల 24న కొత్తగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లో పనులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చేర్పించారు. బ్రెయిన్ డెడ్ అయ్యిందని ఈ నెల 30న ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారు. తిరుమలాచారి తండ్రి రామనాథం, భార్య రజితకు ఆస్పత్రి వైద్యులు అవయవదానంపై అవగాహన కల్పించారు. అతని కళ్లు, గుండె, కిడ్నీలు, ఊపిరితిత్తులు దానం చేయడానికి అంగీకరించారు. దీంతో జీవన్‌దాన్ స్వచ్ఛంద సంస్థకు అవయవాలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు తిరుమలాచారి కుటుంబ సభ్యులను అభినందించారు. అతని అంత్యక్రియలు బుధవారం హమాలీవాడలో నిర్వహించారు. ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ యూనియన్ సభ్యులు మృతుని కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందించారు.

అక్రమంగా వేసిన పోల్స్ తొలగింపు


పోల్స్ తరలిస్తున్న అధికారులు

వాంకిడి(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని ఐటీడీఏ గెస్ట్‌హౌజ్‌లో ఐకేపీ కార్యాలయం నిర్వహిస్తున్నారు. కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 215లోని స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు సిమెంట్ పోల్స్ ఏర్పాటు చేశారు. విషయాన్ని ఐకేపీ అధికారులు రెవెన్యూశాఖ దృష్టికి తీసుకెళ్లారు. స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఈ నెల 19న ఉట్నూర్ ఐటీడీఏ పీవో కార్యాలయం నుంచి వాంకిడి తహసీల్దార్‌కు ఉత్తర్వులు జారీ అయ్యాయి. బుధవారం గిర్దవార్(ఆర్‌ఐ) మాజిత్, సర్వేయర్, పోలీసుల సమక్షంలో పంచనామా నిర్వహించారు. సిమెంట్ పోల్స్ తొలగించి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. స్థలాన్ని పీవో ఆదేశాల మేరకు ఐకేపీ కార్యాలయానికి అప్పగించినట్లు ఆర్‌ఐ మాజిత్ తెలిపారు.

మారిస్తేనే ప్రయోజనం!

- ఆఫీసర్స్ క్లబ్ నిర్వహణపై నీలినీడలు?
- అధికారుల సంఖ్య తగ్గడంతో తరచూ తాళం
- ఆర్‌కేసీవోఏ క్లబ్‌ను సీఈఆర్ క్లబ్‌గా మారిస్తే అందరికీ మేలు
- అందుబాటులోకి తేవాలని కార్మికుల డిమాండ్


రామకృష్ణాపూర్‌లోని ఆఫీసర్స్ క్లబ్


ఆర్‌కేసీవోఏ క్లబ్ సూచిక బోర్డు

రామకృష్ణాపూర్(చెన్నూర్): రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఆఫీసర్స్ క్లబ్ (ఆర్‌కేసీవోఏ) నిర్వహణపై నీలినీడలు కమ్ముకోవడంతో తరచూ తాళం వేసి దర్శనమిస్తోంది. గతంలో ఇక్కడ ఉన్న గనులు, వర్క్‌షాప్, స్టోర్స్, తదితర డిపార్టుమెంట్లలో ఉండే అధికారుల సంఖ్యకు అనుగుణంగా క్లబ్ ఏర్పాటు చేసినప్పటికీ ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. గనులు, వివిధ డిపార్టుమెంట్లు మూతపడటమే కాకుండా అధికారుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. ఈ నేపథ్యంలో ఆర్‌కేసీవోఏ క్లబ్‌ను అలాగే కొనసాగించే కంటే సీఈఆర్ (కంపెనీ ఎంప్లాయీస్ రిక్రియేషన్) క్లబ్‌గా మార్చడం అత్యంత అనివార్యమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా బహుళ ప్రయోజనాలు కూడా ఉంటాయని కార్మికవర్గం భావిస్తోంది.

అధికారుల సంఖ్య తగ్గడమే కారణం

షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, చెస్, తదితర ఇండోర్ గేమ్స్ ఆడేందుకు వీలుగా ఈ ఆఫీసర్స్ క్లబ్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దీంతో పాటు అప్పుడప్పుడు కొన్ని శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించేందుకు కూడా దీనిని వినియోగించే వారు. కానీ ప్రస్తుతం క్లబ్‌కు తరచూ తాళం వేసి దర్శనమిస్తోంది. అధికారుల సంఖ్య గణనీయంగా 60కి పడిపోవటమే దీనికి ప్రధాన కారణం. ఉన్న అధికారుల్లోనూ పలువురు ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఇన్ని కారణాల నేపథ్యంలో ఆఫీసర్స్ క్లబ్‌ను ఎవరూ పట్టించుకోవటం లేదు.

గతంలో పరిస్థితులు వేరు

రామకృష్ణాపూర్ పట్టణంలోని ఆఫీసర్స్ క్లబ్ ఇలా మారడానికి కారణాలు అనేకం ఉన్నాయి. గతంలో ఈ ప్రాంతంలో జీఎం కార్యాలయం ఉండేది. ఆర్‌కే 3, ఆర్‌కే4, ఎంకే 4, ఎంకే 4ఏ, ఆర్‌కే 1, ఆర్‌కే 1ఏ, తదితర భూగర్భ గనులు ఉండేవి. వీటితో పాటు ఏరియా వర్క్‌షాప్, టింబర్‌యార్డు, స్టోర్స్ లాంటి కార్యాలయాలతో ఈ ప్రాంతం కళకళలాడుతూ ఉండేది. అధికారుల సంఖ్య కూడా బాగానే ఉండేది. కాలక్రమేణా అన్నీ మూతపడ్డాయి. ఏరియానే ఎత్తివేశారు. కేవలం రామకృష్ణాపూర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ మాత్రమే ప్రస్తుతం ఇక్కడ ఉంది. ఈ పరిణామాలే క్లబ్ నిర్వహణకు ప్రతిబంధకంగా మారాయని తెలుస్తోంది.

సీఈఆర్ క్లబ్‌గా మార్చడమే మేలు!

ప్రస్తుత ఆఫీసర్స్ క్లబ్‌ను సీఈఆర్ క్లబ్‌గా మార్చడమే మేలనే సూచనలు వినిపిస్తున్నాయి. రామకృష్ణాపూర్‌లో దాదాపు రెండు వేల మంది కార్మికులు ఉన్నారు. క్లబ్ అందరికీ అందుబాటులోకి వస్తే అటు అధికారులతో పాటు ఇటు కార్మికులు, వారి పిల్లలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా ఇండోర్ గేమ్స్ యథావిధిగా నిర్వహించడంతో పాటు వివిధ సమావేశాలకు వినియోగంలో ఉండే అవకాశం ఉంది. ఇక్కడ భిన్నాభిప్రాయాలు వ్యక్తమైతే అవసరమైతే ఉదయం వేళల్లో కార్మికులకు, సాయంత్రం వేళల్లో అధికారులకు క్లబ్‌ను వినియోగించవచ్చు. దీంతో కార్మికవర్గానికి కూడా ప్రయోజనం కలుగుతుంది. ఇప్పటికైనా ఏరియా ఉన్నతాధికారులు ఈ విషయంలో దృష్టి సారించాలని కార్మికులు కోరుతున్నారు. అందరికీ మేలు చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని క్వారీ రోడ్డులో ప్రమాదవశాత్తు కారు బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... స్థానిక జాఫర్ నగర్‌కు చెందిన జువేర్, అబ్దుల్ రహ్మాన్ కారులో ఫొటో షూట్ కోసం క్వారీకి వెళ్లి వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి బోల్తా పడింది. అబ్దుల్ రహ్మాన్‌కు తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించినట్లు బ్లూకోడ్ సిబ్బంది తెలిపారు.

అప్పుడు బిజీ..ఇప్పుడు తీరికగా..!


కార్యకర్తలతో మాట్లాడుతున్న దివాకర్‌రావు

దండేపల్లి: ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బిజీబిజీగా గడిపిన దివాకర్‌రావు ఇప్పుడు కార్యకర్తలతో తీరికగా గడుపుతున్నారు. దండేపల్లి మండలం గూడెం, నంబాల, కాసిపేట, కొండాపూర్, ద్వారక, దండేపల్లి గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఓడిపోయినందుకు ఎవరూ బాధపడవద్దన్నారు. ఓడినా గెలిచినా ఎప్పుడూ ప్రజల మనిషినే అని, నిత్యం ప్రజల కోసం పనిచేస్తానని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, వైస్‌చైర్మన్ రవీందర్, నాయకులు మల్లేశ్, శంకర్‌రావు, భూమన్న, రాజమల్లు, మహేష్ ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బెల్లంపల్లి: రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ బావిలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు టూటౌన్ ఎస్సై రమేశ్ తెలిపారు. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా ఉందన్నారు. మృతుని వయసు 50 సంవత్సరాలు ఉంటుందని, బ్లూకలర్ షర్ట్, బ్లాక్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. అతని వద్ద ఎలాంటి ఆనవాళ్లు లభించ లేదన్నారు. మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

16 రైళ్లకు హాల్టింగ్ ఎత్తివేత

- ఆసిఫాబాద్ రోడ్, రేచినీ రైల్వేస్టేషన్లలో..
- నేటి నుంచి ఈ నెల 19 వరకు
- మూడో రైల్వే లైన్ పనులతో

కాజీపేటరూరల్: కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో గల బల్లార్షా సెక్షన్‌లో మూడో రైల్వేలైన్ పనులతో ఆసిఫాబాద్, రెచినీ రోడ్ రైల్వేస్టేషన్లలో కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లకు ఈ నెల 1 నుంచి 19 వరకు తాత్కాలిక హాల్టింగ్‌లను ఎత్తివేసినట్లు బుధవారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

ఆసిఫాబాద్‌రోడ్‌లో హాల్టింగ్ తొలగించిన రైళ్లు ఇవే..

కాజీపేట–సిర్పూర్ టౌన్ (17003) ప్యాసింజర్, హైదరాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్ (17011) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, భద్రాచలం–సిర్పూర్ టౌన్ (17033) సింగరేణి, సికింద్రాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్ (17233) ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (17234) ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (17012) ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ టౌన్–భద్రాచలం (17034), కరీంనగర్–సిర్పూర్ టౌన్ (07765) ప్యాసింజర్, సిర్పూర్‌టౌన్–కరీంనగర్ (07766) ప్యాసింజర్, సింగరేణి, బల్లార్షా–కాజీపేట (17004) రామగిరి ప్యాసింజర్.

రేచినీలో హాల్టింగ్ తొలగించిన రైళ్లు

హైదరాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్ (17011) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్ (17233) ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (17234) ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (17012) ఎక్స్‌ప్రెస్ కరీంనగర్–సిర్పూర్ టౌన్ (07765) ప్యాసింజర్, సిర్పూర్ టౌన్–కరీంనగర్ (07766) ప్యాసింజర్. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి సహకరించాలని రైల్వే అధికారులు కోరారు. మూడో రైల్వేలైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం


దహనం చేస్తున్న టీజేఎస్ నాయకులు

పాతమంచిర్యాల: తెలంగాణ జనసమితి అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం జరగకుండా బీఆర్ఎస్ నాయకులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో టీజేఎస్ నాయకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా టీజేఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బాబన్న మాట్లాడుతూ పదేళ్ల కాలంలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అవినీతిని కోదండరాం బయటపెడతాడనే భయంతో ప్రమాణ స్వీకారం అడ్డుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్‌కుమార్, నాయకులు వెంకట్‌సాయి, ప్రశాంత్‌రెడ్డి, సంతోష్, అచ్యుతరావు, ధర్మ, జైపాల్‌సింగ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన బాలికల పాఠశాల విద్యార్థినులు ఈ నెల 31న జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. బుధవారం ఎంపికైన విద్యార్థినులను అభినందించారు. పాఠశాలకు చెందిన మమత, జంగుబాయి, హాసిని, కవిత, అఖిల, నీరజ, వైశాలి ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఈ నెల 2 నుంచి 4 వరకు మెదక్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కవిత, పీడీ చిన్నక్క పాల్గొన్నారు.